క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ

గంగారం : ఏజెన్సీలో రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతోందని, దోమల బెడద పెరిగి సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారని, వాటిని తగ్గించేందుకు దుప్పట్లు, దోమ తెరలను పంపిణీ చేయడం జరగుతుందని తహసీల్దార్ రాము అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మండల ప్రజలకు దుప్పట్లు, దోమతెరలను పంపిణీ కార్యక్రమం చేపట్టగా తహసీల్దార్, ఎంపీడీఓ అపర్ణలు హాజరై ప్రజలకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీఓ, మెడికల్ ఆఫీసర్, పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ

కేసముద్రం: మండలంలోని అన్నారంలోని పరమ గురుక్రీస్తు ప్రార్థన మందిరంలో గురువారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా పాస్టర్స్ అండ్ లీడర్స్ అధ్యక్షుడు పిల్లి కుమారస్వామి తెలి పారు. అధ్యక్షుడిగా అప్పాల పేతురు, ఉపాధ్యక్షుడు రిపిక పృధ్వీరాజ్, కార్యదర్శి ప్రభుజీవన్, ఉప కార్యదర్శి మునిగే జోసెఫ్ సురేష్, కోశాధికారి ఇశ్రాయెల్, సలహాదారులు విక్టర్‌పాల్, మహేందర్ ఎన్నికైనట్లు తెలిపారు. ఖాతాఫిలిప్, రత్నం, సుధాకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యా సదస్సును విజయవంతం చేయండి

దంతాలపల్లి : ఈ నెల 7న తొర్రూర్‌లోని ఎల్‌వైఆర్ గార్డెన్‌లో నిర్వహించ తలపెట్టిన విద్యాసదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ పెడరేషన్ జిల్లా ప్రధాన కార్యాదర్శి పులిచింత విష్ణువర్దన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా సదస్సు, డైరీ, క్యాలెండర్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుమాధవరెడ్డి, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు తాళ్లూరి రవీందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనువాస్,సురేందర్, రామలింగం, కుమారస్వామి, పాల్గొన్నారు.

11న సీపీఎం ధర్నా

నెహ్రూసెంటర్ : అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 11న జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహిస్తున్నామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. నాగయ్య మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలాలు దక్కే వరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

అనుమతులు లేని వెంచర్ పనుల నిలిపివేత

దంతాలపల్లి : ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పనులు చేస్తున్న వెంచర్ పనులు నిలిపి వేసి హద్దురాళ్లు తొలిగించినట్లు మండల పంచాయతీ అధికారి అప్సర్‌పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బీరిశెట్టిగూడెంలో నూతనంగా వెలసిన వెంచర్‌కు యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా వారి ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తున్నారన్నారు.ఆ పనులు నిలుపుదల చేశామనిన అక్కడ ఇళ్ల స్థలాలు ఎవరూ తీసుకోవద్దని ప్రజలను కోరారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

మహబూబాబాద్ రూరల్ : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ఖమ్మం జిల్లా మధిరకు చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు వెంకట్రామిరెడ్డి అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం, చేసుకోవాల్సిన కషాయం, పంటలు పండించుకునే విధానం, కషాయం తయారీ (జీవామృతం, జీవన ఎరువులు), గోమూత్రం ద్వారా వివిధ కషాయాల తయారీ, ప్రకృతి వ్యవసాయంలో దిగుబడి పెంచుకునే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్. మాలతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.కిషోర్ కుమార్, రైతులు పాల్గొన్నారు. షెడ్యూల్డ్ కులాల ప్రణాళికలో భాగంగా కంఠాయపాలెం నుంచి 40 మంది రైతులు శిక్షణకు హాజరయ్యారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో రెండు రోజుల పాటు జరిగిన వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. డోర్నకల్ ఫ్రెండ్స్ సంస్థ ప్రతినిధి వీలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ పోటీల ఫైనల్ మ్యాచ్‌లో టంకుతండా, అంబేడ్కర్‌నగర్ జట్లు తలపడగా టంకుతండా విజేతగా నిలిచింది. కార్యక్రమంలో హమారా గావ్ అధ్యక్షుడు వక్కంతుల అప్పారావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్, నాయకులు మాదా శ్రీనివాస్, ఎల్లావుల హరికృష్ణ, వెంకటేశ్వర్లు, తారాచంద్, వెంకటేశ్వర్లు, అశ్వక్, ఎడమకంటి రవి, ఖాదర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబమే బాగు పడింది..

● ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్

నెల్లికుదురు: గత ప్రభుత్వ బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది కాని ఏ ఒక్క నిరుపేద కుటుంబం బాగు పడలేదని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని రాజులకొత్తపల్లిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో కట్టించిన ఇందిరమ్మ ఇళ్లు డబ్బా ఇళ్లని ఎద్దేవా చేసిన కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎక్కడా ఉన్నాయని ప్రశ్నించారు. సర్పంచ్ తూళ్ళ సంధ్యారాణి, ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

అందరికీ న్యాయం చేస్తాం...

కేసముద్రం: పార్టీలకతీతంగా అర్హులైన వారందరికి ఆరు గ్యారంటీ పథకాలను అందించి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. గురువారం మండలంలోని అమీనాపురం, కోరుకొండపల్లి, ధన్నసరి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై, ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాపాలన ప్రత్యేక అధికారి సూర్యనారాయణ, డీఎస్పీ సత్యనారాయణ, ఎంపీడీఓ రవీంద్రరావు, కేసముద్రం పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, సర్పంచులు,ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మురళీనాయక్‌కు సన్మానం

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని వీఎస్.లక్ష్మీపురంలో ప్రజాపాలన గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ను కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి బొకే అందజేసి సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వరకాల వెంకన్న, ఎంపీటీసీ తోట ఏకాంబరం, గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మీసాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం : అమీనాపురంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్

అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ : ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీల దరఖాస్తులను స్వీకరిస్తుందని అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 33, 25 వార్డుల్లో జరిగిన వార్డు సభల్లో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కమిషనర్ టి.ప్రసన్నరాణి డీఈ సీహెచ్‌ఉపేందర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలకు స్పందన

డోర్నకల్: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ప్రజాపాలన గ్రామసభలకు ప్రజల నుంచి స్పందన లభిస్తుంది. గురువారం మండలంలోని హూ న్యాతండా, గొల్లచర్ల, జోగ్యాతండా, రాము తండాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ చలపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సభల్లో సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మహబూబాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న మునిసిపల్ చైర్మన్

కొనసాగుతున్న ప్రజా పాలన

కురవి: మండలంలోని సూదనపల్లి, కందికొండ, అయ్యగారిపల్లి, నేరడ, మోద్గులగూడెం గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతీ, ఏఓ మంజుఖాన్, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

బయ్యారం మండలంలో

బయ్యారం: మండలంలోని జగ్గుతండా, ఇర్సులాపురం, రామచంద్రాపురం, సంతులాల్‌పోడుతండా పంచాయతీ కేంద్రాల్లో నిర్వహించిన గ్రామసభలను ఉద్దేశించి తహసీల్దార్ ఇమ్మానుయల్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గణేష్, సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలి

మరిపెడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్ అన్నారు. మండలంలోని ఉల్లెపల్లి, ఎల్లంపేట, లూనావత్‌తండ, సోమ్లతండ, డీఎస్ఆర్ జెండాలతండ, బుర్హాన్‌పురం గ్రామ పంచాయతీ పరిధిలలో గురువారం ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామ సభలో అధికారులు ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఉల్లెపల్లిలో ఆరుగ్యారంటీల ధరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ చిర్రబోయిన ప్రభాకర్‌తో కలిసి ఎంపీడీవో ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, ఎంపీఓ పూర్ణచందర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు రూరల్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తొర్రూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంపీపీ తూర్పాటి అంజయ్య, జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్ అన్నారు.. గురువారం మండలంలోని పోలెపెల్లిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఆరు గ్యారంటీ పథకాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీడీఓ కుమార్, కోఆప్షన్ సభ్యుడు అంకూస్, సర్పంచ్ పందుల యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

8న అప్రెంటీషిప్ మేళా

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ కంపెనీల ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉదయం 10 గంటలకు ఐటీఐ అన్ని ట్రేడ్‌ల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జాతీయ అప్రెంటీషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.రాధకృష్ణ గురువారం తెలిపారు. విద్యార్థులు ముందుగా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. అప్రెంటీషిప్.ఇండియా.గౌట్. ఇన్ వెబ్‌సైట్‌లో తమ తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నా రు. జిరాక్స్ కాపీలతో ఐటీఐ కళాశాలకు హాజరుకావాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

డోర్నకల్: గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్సై ఝాన్సి అన్నారు. మండలంలోని గొల్లచర్లలో గురువారం సైబర్ నేరాలపై ఆమె గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంక్ వ్యవహారాలతో పాటు ఇతర విషయాలకు సంబంధించిన ఓటీపీ నంబర్లను అపరిచితులకు చెప్పవద్దని సూచించారు.

సర్పంచ్, ఎంపీటీసీ భర్త మధ్య వాగ్వాదం

కేసముద్రం: మండల కేంద్రంలో ఓ కాలనీలో వేస్తున్న సీసీ రోడ్డు పనుల విషయంలో స్థానిక ఎంపీటీసీ భర్త ఆగె వెంకన్న, సర్పంచ్ బట్టు శ్రీనుకు మధ్య గురువారం వాగ్వాదం చోటుచేసుకుంది. రోడ్డు పనుల్లో నాణ్యత లేదంటూ ఎంపీటీసీ భర్త పనుల వద్దకు వెళ్లి ప్రశ్నించాడు. ఈ క్రమంలో అక్కడికి సర్పంచ్ చేరుకోగా వారిద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది.ఘటనపై ఇరువురు ఒకరిపై, ఒకరు పీఎస్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

చిన్నగూడూరు: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రెండో విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం నిర్వహించారు. మండల పరిధిలోని 10 గ్రామ పంచాయతీల్లో సోషల్ ఆడిట్ బృందం పర్యటించి ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులను తనిఖీ చేశారు. పనులకు సంబంధించిన వివరాలను రికార్డులను అధికారులు పరిశీలించి నివేదికను ప్రజావేదికలో చదివి వినిపించారు. పలు పనుల్లో రూ.7,69,950లు దుర్వినియోగమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఏపీడీ శాంతికుమారి మాట్లాడుతూ ఉపాధి హామీలో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దుర్వినియోగం అయిన మొత్తాన్ని రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌మెన్ బి. ఆదాము, ఎంపీడీఓ శ్యాంసుందర్, ఎంపీపీ వల్లూరి పద్మ, ఈజీఎస్ సిబ్బంది, సోషల్ ఆడిట్ బృందం పాల్గొన్నారు.



ఈజీఎస్ పనుల వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మరిపెడ రూరల్: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని లూనావత్‌తండ అంగన్‌వాడీ టీచర్ లూనావత్ జ్యోతి అన్నారు. మండలంలోని లూనావత్ తండా పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలోని లబ్ధిదారులకు పరిశుభ్రతపై టీచర్ గురువారం అవగాహన కల్పించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్ : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 16 ఏళ్ల నుంచి ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్న 'నేనుసైతం' స్వచ్ఛంద సేవా సంస్థ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను అంబేద్కర్ విగ్రహం ఎదుట మహబూబాబాద్ న్యాయవాదులు గురువారం ఆవిష్కరించారు. సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మహ్మద్ సలీమ, న్యాయవాదులు సోమ రాంరెడ్డి, బోనగిరి ఆనంద్ గుప్త, రామకృష్ణ, మోహన్ నాయక్ పాల్గొన్నారు.

ఆస్పత్రి ఎదుట ఉద్రిక్తత

నెహ్రూసెంటర్: ఆపరేషన్ వికటించి వ్యక్తి మృతి చెందాడని ఆరోపిస్తూ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్దకు గురువారం రాత్రి మృతుడి కుటుంబ సభ్యులు రావడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఓ వ్యక్తికి ఆపరేషన్ చేయగా వికటించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందాడు. అయితే జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు దవాఖాన వద్దకు చేరుకున్నారు. కాగా ఎలాంటి ఆందోళనలు లేకుండా ఇరుపక్షాల ఆధ్వర్యంలో చర్చలు జరిపి వెళ్లిపోయినట్లు సమాచారం.

సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి

● ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్

కేసముద్రం: సమాజంలో ప్రతి ఒక్కరు సేవాదృక్పథాన్ని కలిగి ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. గురువారం మండలంలోని కల్వల జెడ్పీ హైస్కూల్‌లో పేద విద్యార్థినులకు రోటరీ క్లబ్, హనుమకొండ ఆధ్వర్యంలో సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దూరప్రాంతాల నుంచి స్కూల్‌కి వచ్చే ఆడపిల్లలకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్లను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట సంజీవరెడ్డి, ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, హెచ్ఎం బండారు నరేందర్, క్లబ్ బ్రాంచ్ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్, జనరల్‌సెక్రటరీ సతీష్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్

కళాకారులను ఆదుకోవాలి

నెహ్రూసెంటర్ : తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆటాపాటలతో ఉద్యమంలో పాల్గొని కాలుకు గజ్జెకట్టి ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన కళాకారులను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం కళాకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కోసం పోరాటాల్లో పాల్గొని ముందున్న కళాకారులకు గత ప్రభుత్వంలో అన్యాయం జరిగిందన్నారు. నూతనంగా రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్‌ప్రభుత్వం ఉద్యమంలో కీలకంగా పని చేసిన కళాకారులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో కళాకారులు పి.శ్రీనివాస్, రమేష్, కట్లోజు పాండు రంగాచారి, వేణు, రవీదర్, హరిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

గార్ల: మండలంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం సుడిగాలి పర్యటన చేశారు. తొలుత మండలంలోని పెద్దకిష్టాపురంలో మన ఊరు- మన బడి పథకం కింద అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అనంతరం తొలిసారి పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం గార్లలోని అంబేద్కర్‌నగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న వి.జయప్రసాద్‌ను పరామర్శించి, కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, ఎస్‌కె యాకూబ్‌పాషా, జి లెనిన్, రాజశేఖర్, పి వీరస్వామి, సూర్య, తదితరులు ఉన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు రూ.25 లక్షలు మంజూరు



నిధుల మంజూరీ పత్రాన్ని అందజేస్తున్న వద్దిరాజు

కేసముద్రం: మండలంలో నిర్మించే మున్నూరుకాపు కమ్యూనిటీ హాల్‌కు రాజ్యసభ సభ్యుడు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి చందా గోపి తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో వద్దిరాజును ఆసంఘం నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు కముటం శ్రీనివాస్, సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కముటం స్వామి, కోశాధికారి సింగంశెట్టి ఏకాంతం , గౌరవ సలహాదారులు రావుల మురళి ఉన్నారు.

అదృశ్యం.. కేసు నమోదు

గార్ల : ఓ వ్యక్తిపై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ గురువారం తెలిపారు. తిర్లాపురం గ్రామానికి చెందిన తేజావత్ అమర్‌సింగ్, భార్య తేజావత్ ప్రియాంకతో గొడవ పడి ఈనెల 2న ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. చుట్టుప్రక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో వెతికినా అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహాజన రాజ్యస్థాపనకు పోరాడుదాం

నెహ్రూసెంటర్ : సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం దేశంలో అమలైనప్పుడు రాజ్యం ఏర్పడుతుందని, మహాజనుల రాజ్య స్థాపనకు పోరాడాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య అన్నారు. ఎంఎస్పీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను గురువారం జిల్లా కేంద్రంలోని మంద కొమురమ్మనగర్‌లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాజన రాజ్య స్థాపనకై ఎంఎస్పీతో భాగస్వాములై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అబ్బూరి వినోద్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మిడతపల్లి యాకయ్య, సంగపొంగు శ్రీను, ఎండి. రజియా, సుమిత్రనాయక్, శ్రీను, ఎండి.పాష, సోమయ్య, సరిత, చంద్రకళ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న గుగ్గిళ్ల పీరయ్య

సంక్షిప్త సమాచారం

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



కొత్తగూడ: సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కల చిత్రపటానికి వేలుబెల్లి సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం పాలాభిషేకం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అ నతి కాలంలోనే ఎన్నికల హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే చెందుతుందన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడ: డీసీసీ బ్యాంకు సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి రజిత కోరారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మిగతా బ్యాంకులతో పోలిస్తే రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడం, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఎక్కువ వడ్డీని ఇస్తున్నట్లు వివరించారు. అంతే కాకుండా కార్పోరేట్ బ్యాంకులతో సమానమైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో వినియోగదారుల సంఖ్య పెరిగితే బ్రాంచ్ వచ్చే అవకాశం ఉన్నదని అన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో ప్రచారం

కేసముద్రం: దొంగలు పడుతున్నారు ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలంటూ మండల కేంద్రంలో ఎస్సై వంశీధర్ ఆధ్వర్యంలో గురువారం ఆటో ద్వారా తిరుగుతూ పోలీసులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు తమ విలువైన బంగారు ఆభరణాలు, నగదును జాగ్రత్తగా దాచుకోవాలన్నారు. అనుమానస్పదంగా ఎవరైనా వ్యక్తులు తిరిగినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

నీరాటోత్సవాలు ప్రారంభం

మహబూబాబాద్ రూరల్ : ధనుర్మాస వ్రత మహోత్సవ పూజా వేడుకల్లో భాగంగా పట్టణంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవాలయం ,శ్రీవేణుగోపాలస్వామివారి దేవాలయంలో గురువారం గోదాదేవి అమ్మవారిని పెళ్లికూతురునిచేసే (నీరాటోత్సవ) వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయాల ప్రధాన అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్, ముడుంబై లక్ష్మీనారాయణ చార్యులు గోదాదేవి అమ్మవార్ని రూపాలతో ఆలయాల ప్రదక్షిణ చేశారు.

ఉపాధ్యాయుడి ఒక రోజు వేతనం నిలిపివేయాలి

నెల్లికుదురు: అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మండలంలోని మునిగలవీడు ప్రాథమిక పాఠశాలకు ఎగనామం పెట్టిన ఉపాధ్యాయుడు మధుకు ఒక రోజు వేతనం నిలిపి వేయాలని షోకాజ్ నోటీసులు అందించాలని డీఈఓ రామారావు కాంప్లెక్స్ హెచ్ఎంకు ఆదేశాలు జారి చేశారు. మండలంలోని మునిగలవీడు, బ్రాహ్మణకొత్తపల్లి, రాజులకొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని లేకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలను ఆదేశించారు.



మునిగలవీడులో ఉపాధ్యాయులతో మాట్లాడుతన్న డీఈఓ

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి


నెహ్రూసెంటర్ : ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. పార్టీ జిల్లా కమిటీ సమావేశం గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో కాంగ్రెస్‌కు ఓటు వేసిన ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లో అమలు చేసి ప్రజలకు అందించాలన్నారు. కేంద్రంలోని మోదీ సర్కార్ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఇప్పటికే ప్రజలు ఇప్పటికే నష్టపోయారన్నారు. సమావేశంలో కె.భాస్కర్‌రెడ్డి, ఫైండ్ల యాకయ్య, ఆవుల కట్టయ్య, నేరెళ్ళ బలరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నేతలు

డోర్నకల్: స్థానిక కూరగాయల మార్కెట్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. ఖమ్మంలో మంత్రి తుమ్మలను గురువారం డోర్నకల్ కాంగ్రెస్ నాయకులు మాదా శ్రీనివాస్, తాళ్లూరి హనుమంతరావు కలిసి స్థానిక సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కూరగాయల మార్కెట్‌తో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వారు మంత్రిని కోరారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

పెద్దవంగర: విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని హెచ్ఎం పాకనాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిన్నవంగర పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కోట వెంకటేశం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులకు సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ గురుకులాల్లో ప్రవేశపరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఆర్పీల సంఘం రాష్ట్ర కోశాధికారి యాసారపు వెంకటేష్, సీఆర్పీ వేములు సంతోష్, పాల్గొన్నారు.

